క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి వితరణ



ఎలక్ట్రిక్ కుక్కర్ అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి ప్రముఖ వ్యాపారవేత్త పాట్నూరు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు వారి తండ్రి శ్రీరాములు జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువైన ఎలక్ట్రిక్ కుక్కర్‌ను గురువారం బహూకరించారు. ప్రతిరోజూ 500 మంది రోగుల సహాయకులకు అన్నదాన పథకం నిర్వహించడం అభినందనీయమని, తమ వంతుగా ఈ సాయం అందిస్తున్నామని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ సూర రామచంద్రరావు, మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆంజనేయుని సన్నిధిలో సివిల్స్ విజేత



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న చల్ల కల్యాణి

గార: రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీ వద్ద ఆంజనేయుని ఆలయం వద్ద స్వామివారిని సివిల్స్ విజేత చల్ల కల్యాణి గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పందిరి అర్జునరావు ఆమెకు ఆహ్వానం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు దుర్గాదేవిని ఆమె దర్శించుకున్నారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న ఏసీ చంద్రశేఖర్



ఆలయంలో ఏసీ చంద్రశేఖర్

గార: శ్రీకూర్మం గ్రామంలోని కూర్మనాథున్ని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి విచ్చేసిన ఆయన మూలవిరాట్ వద్ద గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. ఈవో జి.గురునాథం, ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం పాలక సంస్థ పరిధిలో భూసర్వే



పెద్దపాడులో భూసర్వే చేయిస్తున్న కమిషనర్ ఓబులేషు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : శ్రీకాకుళం పాలక సంస్థ పరిధిలో భూసర్వే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ఓబులేషు పేర్కొన్నారు. గురువారం నగర సంస్థ పరిధిలోని పెద్దపాడు సరిహద్దు ప్రాంతంలో డ్రోన్ సర్వే జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో గల భవనాలు, భూములకు హక్కుపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఐ.వి.రమణమూర్తి, హరిబాబు, టీపీవో ఉమామహేశ్వరరావు, పట్టణ సర్వేయర్ ప్రభాకరరావు, డబ్ల్యూపీఆర్ఎస్ రవికిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మేలు



ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: గ్రామానికే వచ్చి వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మణిభూషణ్ అన్నారు. మండలంలోని సుభద్రాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో ప్రభుత్వ బడులు



జగనన్న ఆణిముత్యాలు పేరిట విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- నియోజకవర్గ స్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు' పంపిణీ

రణస్థలం : అధ్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి విద్యార్థులను ప్రగతి బాటలో నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని జె.ఆర్.పురం హైస్కూల్లో గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ బడులు, కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించి మొదట మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా దుశ్శాలువతో సత్కరించి షీల్డ్ అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులనూ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుంచి ఉన్నత చదువులు చదివేంత వరకు అన్నివిధాలుగా సీఎం జగన్ తోడ్పాటునందిస్తున్నారని చెప్పారు. బడికి పంపిన విద్యార్థుల తల్లులకు అమ్మఒడి రూపంలో రూ.15 వేలు అందజేస్తూ... పాఠశాలలో పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలతో పాటు జగనన్న గోరుముద్ద రూపంలో ఎన్నో రకాల విలువైన కానుకలను బడులు తెరిచిన మొదటి రోజునే అందించడం అద్భుతమైన విషయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎప్పుడైనా ఇటువంటి విద్యాకానుకలు, వసతి దీవెలు, అమ్మ ఒడి పథకాలు అందించిందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యా వ్యవస్థకు సంబంధించి సీఎం జగన్ చేస్తున్న మంచి పనులపై బంటుపల్లి హెచ్‌ఎం పి.వి.రమణమూర్తి చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం, జి.సిగడాం జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, కాయల రమణ, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, బూరాడ వెంకటరమణ, చిల్లా వెంకటరెడ్డి, డోల వెంకటరమణ, మైలపల్లి కామరాజు, పచ్చిగుళ్ల సాయిరాం, ఎంఈఓ త్రినాథరావు, హైస్కూల్ హెచ్‌ఎం బి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



విద్య కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్న విధానం అద్భుతం. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ బడుల వైపు దేశం మొత్తం చూసేలా చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు. ఆయన చేస్తున్న మంచికి మరో ముప్పై ఏళ్లు సీఎంగా కొనసాగాలి.

– పి.వి.రమణమూర్తి, బంటుపల్లి పాఠశాల హెచ్‌ఎం

ప్రోత్సాహం బాగుంది..



ఉత్తమ విద్యార్థులను సీఎం జగన్ మామయ్య గుర్తించి ప్రోత్సహించడం బాగుంది. ప్రతిభావంతులకు సత్కరించడం వల్ల తోటి విద్యార్థులకు సైతం ఉత్సాహం కలుగుతుంది. విద్యలో పోటీతత్వం పెరుగుతుంది.

– కంబపు ప్రియాంక, ఇంటర్మీడియట్ విద్యార్థి, గోసాం, కృష్ణాపురం పంచాయతీ

కూరగాయల సాగుకు ప్రాధాన్యం



సాగును పరిశీలిస్తున్న ట్రైనర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు కూరగాయల సాగుకు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ శోభన్‌బాబు అన్నారు. ఎస్‌ఎంపురంపేటలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నిర్వహిస్తున్న ఎం.ధనుంజయ, సువ్వారి సన్యాసిరావు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు, పశువుల గత్తం వినియోగంపై ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ఆకుకూరలు, తృణధాన్యాల సాగు వల్ల భూసారం పెరుగుతుందన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎస్ఆర్‌పురంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు దుంప చిన్నారెడ్డి ప్రారంభించారు. వేతనదారులు పనులు సద్వినియోగం చేసుకోవాలని, సాంకేతిక సహాయకుల సూచనలతో గరిష్ట వేతనం పొందాలని సూచించారు.

వృద్ధుల సంక్షేమ చట్టాలు అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

శ్రీకాకుళం కల్చరల్: వృద్ధుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు కోరారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా నగరంలోని శాంతా కల్యాణ్ అనురాగ నిలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆస్తి, ప్రాణరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సంఘ సభ్యులు కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, ఎస్పీలకు వినతిపత్రాలు అందచేశారు. జిల్లాలో ఎవరైన వృద్ధులు వేధింపులకు గురైతే తమ సంఘం సభ్యులు సోమసుందరరావు(9502249878), ప్రకాశరావు (9440106090), నరసింహమూర్తి(9440152146)లను సంప్రదించవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పేర్కొన్నారు. జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ నంబరు–14567పై అన్ని పోలీస్ స్టేషన్లు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, సచివాలయాల వద్ద విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా అధికారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పి.నరసింహమూర్తి, కె.సోమసుందరరావు, ఎంఎస్ఆర్ఎస్.ప్రకాశరావు, పి.ఎస్.ప్రసాదరావు, సీనియర్ సిటిజెన్లు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నంలో నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న యువతి వేసవి సెలవులు కారణంగా ఇంటికి వచ్చింది. తిరిగి కళాశాల రీఓపెనింగ్ కావడంతో తండ్రి తోడుగా ఈ నెల 14న తిరిగి విశాఖపట్నం చేరింది. అక్కడికి వెళ్లాక కళాశాల హాస్టల్ బాగోలేదని, ఇక్కడ ఉండనంటూ తల్లికి ఫోన్ చేయగా ఆమె మందలించింది. తిరిగి అదే రోజు తండ్రితో శ్రీకాకుళం చేరి ఆర్టీసీ కాంప్లెక్సులో ఉన్న వాష్‌రూమ్‌కు వెళ్తానంటూ వెళ్లిన కుమార్తె తిరిగి కనిపించలేదు. మానేసిందని, చుట్టుపక్కల వాకబు చేసినా, బంధువుల వద్ద ఆరా తీసినా కనిపించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ప్రేమ్‌కుమార్ దంపతులతో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: చల్లపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేసి నక్కపేట ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెళ్తున్న చింతాడ ప్రేమ్‌కుమార్‌కు గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రేమ్‌కుమార్ విద్యార్థులను పోటీపరీక్షలకు సన్నద్ధం చేయడంతోపాటు అవసరమైన కనీస సదుపాయాలను సొంతంగా సమకూర్చి విద్యార్థులను తీర్చిదిద్దారని ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో కొత్తచరిత్ర



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త చరిత్ర సృష్టించిందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ధర్మవరం పంచాయతీ రామజోగిపేటలో గురువారం పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమం ఏపీలో అమలవుతోందన్నారు. సామాజిక ప్రగతిలో భాగంగా అర్హత గల ప్రతి కుటుంబం లబ్ధి పొందుతోందని చెప్పారు. పింఛన్లు, అమ్మఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన ఆసరా, చేయూత, చేదోడు, జగనన్న తోడు వంటి పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతున్నాయని తెలిపారు. రామజోగిపేట గ్రామస్తులకు రూ.1.82 కోట్ల మేర సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, నాయకులు నక్క కృష్ణమూర్తి, బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్, మూగి శ్రీరాములు, అల్లు సూర్యనారాయణ, అసనవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి రెడ్డీస్ ఆర్థిక సాయం



శ్యామలకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పదో తరగతి ఫలితాల్లో 583 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పైడిభీమవరం పాఠశాల విద్యార్థిని గోరు శ్యామలకు రూ.25 వేలు నగదు పురస్కారాన్ని డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ యాజమాన్యం ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. జె.ఆర్.పురం హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్డీస్ హెచ్ఆర్ మేనేజర్ దీపక్ మాట్లాడుతూ పైడిభీమవరం పరిసర ఏడు మండలాల్లో శ్యామల మొదటి స్థానంలో నిలిచిందని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పైడి భీమవరం మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపాలి



పాతగూనపాలెంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: పిల్లలను బడికి పంపాలని గూనపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. ప్రపంచ బాలకార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గూనపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను పనిలోకి కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు, బడికి పంపించినపుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం బాలకార్మికులను నిర్మూలిద్దాం, తోటకు పువ్వులు అందం–బడికి పిల్లలు అందం, పెద్దలు పనికి –పిల్లలు బడికి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు టి.సుజాత, బి.ఆదిలక్ష్మి, హెల్పర్లు కె.నాగమణి, జె.పావని, ఆశా వర్కర్ ఎం.అమ్మాజీ, చిన్నారులు పాల్గొన్నారు.

29 నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో ఈ నెల 29 నుంచి జూలై 3 వరకు గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న సామూహిక సత్యవ్రతాలు, 30న సామూహిక కుంకుమార్చనలు, దుర్గాహోమం, 1న సత్యనారాయణస్వామి వ్రతాలు, 2న 108 కలశాలతో మూలవిరాట్‌కు అభిషేకాలు, 3న నూతన వస్త్రాలంకరణ, స్వర్ణకిరీట ధారణ, అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో షిరిడిసాయి నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలకు ఆసరాగా దిశ యాప్



జి.సిగడాం: దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు



శ్రీకాకుళం క్రైమ్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పప్పల శ్రీనివాసరావు



శ్రీకాకుళం క్రైమ్: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు



శ్రీకాకుళం క్రైమ్: అవగాహన కల్పిస్తున్న ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్/జి.సిగడాం: ప్రతిఒక్కరూ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద విద్యార్థులకు, మహిళలకు దిశా యాప్ డౌన్‌లోడ్, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు దిశా యాప్ ఆపద సమయంలో రక్షణగా పనిచేస్తుందన్నారు. నగరంలోని కిమ్స్ ఆసుపత్రి వద్ద స్టాఫ్‌నర్సులు, సిబ్బందికి రెండో పట్టణ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు దిశా యాప్ వాడకంపై, మహిళల రక్షణకు గల చట్టాలపై అవగాహన కల్పించారు. జి.సిగడాంలో ఎస్ఐ సామంతుల రామారావు దిశ యాప్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు.

శ్రీకాకుళం క్రైమ్: ప్రతి మహిళ ధైర్యంగా ఉంటూ సమస్యలు ఎదురైనప్పుడు పోరాడే శక్తి కలిగి ఉండాలని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ లెంక సన్యాసినాయుడు అన్నారు. మహిళల భద్రత, దిశాయాప్ వాడకం, సైబర్ క్రైమ్ నేరాలపై గురువారం రాత్రి నగరంలోని మహిళల ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగికంగా వేధించినా శిక్షలు తప్పవన్నారు. దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసుకుని సమస్యపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బలివాడ గణేష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

శ్రీకాకుళం: నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఐసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఐసెట్ ఫలితాల్లో 50 లోపు 8 ర్యాంకులు, 100లోపు 17 ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ బీటీవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్, సీఆర్‌టీ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినికి అభినందనలు



ఇందిర, ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న నాయకులు

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో చదివి పదో తరగతిలో 582 మార్కులు సాధించిన పొగిరి ఇందు, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంకను గురువారం మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, ఎంఈఓ అరసాడ రవి అభినందించారు. కార్యక్రమంలో మండల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జీల్లో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే సంఘ విద్రోహక శక్తులకు లాడ్జీల్లో వసతి ఇవ్వరాదని ఒకటో పట్టణ సీఐ లెంక సన్యాసినాయుడు అన్నారు. బుధవారం అర్ధరాత్రి గస్తీల్లో భాగంగా నగరంలోని నాలుగు లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆధార్ కార్డు క్షుణ్ణంగా పరిశీలించాకే గదులు ఇవ్వాలని, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పేకాట శిబిరాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నడిపితే యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జి.సిగడాం ఎంపీడీఓగా నిశ్చల



నూతన ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

జి.సిగడాం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నిశ్చల గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ఎస్.శ్రీనివాసరావు పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పూజారి రామ్మోహన్, జి.సిగడాం సచివాలయం పంచాయతీ కార్యదర్శి సాహు, పొగిరి రాము ఎంపీడీఓకు అభినందనలు తెలియజేశారు.